క్లుప్తంగా

ధరణి దరఖాస్తులు త్వరగా పూర్తిచేయాలి



ఈ-సూపరింటెండెంట్ కార్యాలయాన్ని సందర్శిస్తున్న కలెక్టర్

భానుపురి : కలెక్టరేట్‌లోని ఈ–సూపరింటెండెంట్ కార్యాలయాన్ని కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ శుక్రవారం రాత్రి ఆకస్మికంగా సందర్శించారు. ధరణి దరఖాస్తులను తప్పుల్లేకుండా త్వరగా పూర్తి చేయాలన్నారు. కార్యాలయాలను పరిశుభ్రంగా ఉంచాలని, సిబ్బంది సమయపాలన పాటించాలని సూచించారు. ఆయన వెంట సుదర్శన్‌రెడ్డి, ఈ–సెక్షన్ సూపరింటెండెంట్ వాజిద్, కార్యాలయ సిబ్బంది శ్రీకాంత్, నగేష్, జ్యోతి ఉన్నారు.

మాజీ ఎమ్మెల్యే కిషోర్‌ను కలిసిన దీపిక దంపతులు



మాజీ ఎమ్మెల్యే కిషోర్‌కుమార్‌ను సన్మానిస్తున్న గుజ్జ దీపిక యుగేంధర్‌రావు

తుంగతుర్తి : జెడ్పీచైర్‌పర్సన్‌గా పదవికాలం పూర్తయినందున గుజ్జ దీపిక యుగేంధర్‌రావు శుక్రవారం తుంగతుర్తి మాజీ శాసనసభ్యుడు గాదరి కిషోర్‌కుమార్‌ను నల్లగొండలోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో ఘనంగా సన్మానించారు. అనంతరం ఎమ్మెల్యే వారిని సన్మానించారు. ఐదేళ్ల పదవి కాలం విజయవంతంగా పూర్తిచేసుకోవడంతో అభినందనలు తెలిపారు.

మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించాలి

నూతనకల్ : మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించే విధంగా మహిళా సమాఖ్య సభ్యులు కృషి చేయాలని ఏపీఎం కర్ణాకర్ కోరారు. శుక్రవారం మండల సమాఖ్య కార్యాలయంలో మహిళా సంఘాలకు నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. బ్యాంకులు, స్త్రీనిధి ద్వారా తీసుకున్న రుణాలను సమభావన సంఘాల సభ్యులు సక్రమంగా వినియోగించుకొని ఆర్థికాభివృద్ధి సాధించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సీసీలు ముత్తయ్య, సరస్వతి, గీత తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుడికి ఎమ్మెల్యే నివాళి



మృతుడి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే మందుల సామేల్

తిరుమలగిరి : మామిడాల గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు మందపురి సోమయ్య ఇటీవల మృతి చెందారు. దీంతో మృతుడి చిత్రపటానికి తుంగతుర్తి శాసన సభ్యుడు మందుల సామేల్ శుక్రవారం నివాళులర్పించారు. అదేవిధంగా జలాల్‌పురం గ్రామానికి చెందిన దాచేపల్లి వెంకటనారాయణ ఇటీవల మృతి చెందగా ఆయన కుటుంబాన్ని పరామర్శించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు వై.నరేష్, వర్కింగ్ ప్రెసిడెంట్ జమ్మిలాల్, పట్టణ శాఖ అధ్యక్షుడు వీరేష్, శాగంటి రాములు, సుంకరి జనార్దన్, అబ్బాస్, లింగయ్య, దాచేపల్లి వెంకన్న, వీర శేఖరయ్య తదితరులు పాల్గొన్నారు.

కళావేదిక జిల్లా ప్రధాన కార్యదర్శిగా శైలేందర్



అర్వపల్లి : తెలంగాణ కళావేదిక జిల్లా ప్రధాన కార్యదర్శిగా అడివెంల గ్రామానికి చెందిన బొర్ర శైలేందర్ నియమితులయ్యారు. అతడి నియామకాన్ని కళావేదిక రాష్ట్ర అధ్యక్షుడు నకిరేకంటి కిరణ్‌కుమార్ ఆదేశాల మేరకు జిల్లా అధ్యక్షుడు ఎర్ర అనుదీప్, జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు జూలూరు మమతలు శుక్రవారం ప్రకటించారు.

అందుబాటులో ఎరువులు

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం మండలం తిమ్మాపురంలోని పీఏసీఎస్‌లో రైతులకు ఎరువులు అందుబాటులో ఉన్నాయని ఆ సంఘం చైర్మన్ మారిపెద్ది మంగమ్మ, సీఈఓ ఊర సత్యనారాయణ తెలిపారు. డీఏపీ 400 బస్తాలు, 14.35 14బస్తాలు, 20.20.0.13 200బస్తాలు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. కావాల్సిన రైతులు తీసుకెళ్లాలని కోరారు.

మొక్కల పంపిణీ

మోతె : మండలంలోని పలు గ్రామాల్లో వన మహోత్సవంలో భాగంగా శుక్రవారం ఆరు రకాల పూలు, పండ్ల మొక్కలను ఏపీఓ నగేష్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాల సీజన్ ప్రారంభమైనందున ప్రతి ఇంట్లో పండ్లు, పూల మొక్కలు నాటుకోవాలన్నారు. రోడ్ల వెంట, కాల్వల వెంట తీసిన గుంతల్లో మొక్కలు నాటాలన్నారు.

మధ్యాహ్న భోజనం.. ధరా భారం

- నిత్యావసరాల ధరలు పెరగడంతో ఏజెన్సీలపై ఆర్థికభారం
- ప్రభుత్వం చెల్లించే బిల్లులు సరిపోక నిర్వాహకుల ఆవేదన



తిరుమలగిరి ప్రభుత్వ పాఠశాలలో వంట చేస్తున్న నిర్వాహకురాలు

తిరుమలగిరి : కొద్ది రోజులుగా నిత్యావసరాల ధరలు విపరీతంగా పెరగడంతో మధ్యాహ్న భోజన పథకంపై ప్రభావం చూపుతోంది. ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్నం పూట విద్యార్థుల ఆకలి తీర్చేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ పథకాన్ని అమలు చేస్తున్నాయి. కానీ ఈ మధ్యకాలంలో కూరగాయల ధరలు పెరుగుతుండటంతో పథకం అమలులో ఏజెన్సీ సభ్యులు అనేక అవస్థలు పడుతున్నారు. నిర్దేశించిన మేరకు నాణ్యతా ప్రమాణాలు పాటించి మధ్యాహ్న భోజనాన్ని అందించాలంటే వారిపై అదనపు ఆర్థిక భారం తప్పడం లేదు. ప్రభుత్వ పాఠశాలల్లో ఒక్కో విద్యార్థికి 1నుంచి 5వ తరగతి వరకు రూ.5.45పైసలు, 6వ తరగతి నుంచి 8వ తరగతి వరకు రూ.8.17 పైసలు, 9 నుంచి 10వ తరగతి వరకు రూ.10.67 పైసల చొప్పున మధ్యాహ్న భోజనానికి ప్రభుత్వం చెల్లిస్తుంది. అయితే పెరిగిన ధరలను తీసుకుంటే ఈ చెల్లింపులు సరిపడని పరిస్థితి నెలకొంది. నిత్యావసరాల ధరలు పెరుగుతున్నా ప్రభుత్వం మాత్రం బిల్లులు పెంచకపోవడంతో ఏజెన్సీలకు ఆర్థికభారం పెరుగుతోంది. పైగా వారానికి మూడు సార్లు కోడి గుడ్లు అందించడం ఇబ్బందిగా మారుతోంది. అంతేకాకుండా ఏజెన్సీలకు బిల్లుల చెల్లింపులో ప్రభుత్వాలు జాప్యం చేస్తుండటంతో అప్పులు చేసి ఏదోలా నెట్టుకొస్తున్నారు.

ధరలు పెరగడంతో ఇబ్బందులు



మధ్యాహ్న భోజనానికి అవసరమయ్యే కూరగాయల ధరలు విపరీతంగా పెరిగిపోయాయి. ఏవి కొనాలన్నా కిలోకు రూ.80 పైనే ఉన్నాయి. ఇలా ధరలు పెరుగుతుంటే మాకు గిట్టుబాటు కావడం లేదు. ప్రభుత్వం వంట ఏజెన్సీ వాళ్లకు ధరలు పెంచాలి.

– చిలుక నర్సమ్మ, అనంతారం

సకాలంలో బిల్లులు చెల్లించాలి

సకాలంలో బిల్లుల చెల్లింపులు జరిగితే మధ్యాహ్న భోజనం సజావుగా సాగించేందుకు అవకాశం ఉంటుంది. బకాయిలు ఉండటంతో ఆర్థిక భారం తప్పడం లేదు. కూరగాయలు, ఆకు కూరల ధరలు భరించలేని పరిస్థితి నెలకొంది.

– యాదమ్మ, జలాల్‌పురం

కలెక్టర్‌ను కలిసిన సమాచార వికాస సభ్యులు



కలెక్టర్ తేజస్ నందలాల్ పవర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న సమాచార హక్కు సమితి సభ్యులు

నాగారం : సూర్యాపేట జిల్లా నూతన కలెక్టర్‌గా ఇటీవల బాధ్యతలు చేపట్టిన తేజస్ నందలాల్ పవర్‌ను సమాచార హక్కు వికాస సమితి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నాగారం మండల కేంద్రానికి చెందిన సమాచార హక్కు వికాస సమితి జిల్లా అధ్యక్షుడు గుంటకండ్ల ముకుందారెడ్డి మాట్లాడారు. ప్రైవేటు విద్యాసంస్థలు సామాన్యులపై అధిక ఫీజుల భారం మోపుతున్నాయని అన్నారు. అధిక ఫీజులను తగ్గించే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సమాచార హక్కు వికాస సమితి జిల్లా గౌరవ అధ్యక్షుడు ఉన్నం సత్యనారాయణ, జిల్లా ప్రధాన కార్యదర్శి చేకూరు శివ, దండా వెంకటరెడ్డి, బంగారు శ్రీధర్, పూలమ్మ, విమల, గోవిందారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు జాజిరెడ్డిగూడెం జెడ్పీహెచ్‌ఎస్‌కు కలెక్టర్ రాక

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం జెడ్పీహెచ్‌ఎస్‌లో రేఖ చారిటబుల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం జరిగే ఉచిత నోటు పుస్తకాల పంపిణీ కార్యక్రమానికి కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారని ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు డాక్టర్ బోయలపల్లి రేఖ, మాజీ సర్పంచ్, ఫౌండేషన్ డైరెక్టర్ మడ్డి పద్మ తెలిపారు. శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. మండల వ్యాప్తంగా 24 ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలకు 3వేల నోటు పుస్తకాలను ఉచితంగా పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. 10వ తరగతిలో 10జీపీఏ సాధించిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు అందజేయనున్నట్లు తెలిపారు.

తప్పులను, అవినీతిని తప్పకుండా ప్రశ్నిస్తా

- బీజేవైఎం రాష్ట్ర నాయకుడు వరుణ్‌రావు



సమావేశంలో మాట్లాడుతున్న వరుణ్‌రావు

సూర్యాపేట : ఎన్నికల్లో లబ్ధిపొందేందుకు అప్పటి మంత్రి, ఎమ్మెల్యే జగదీష్‌రెడ్డి డబుల్‌బెడ్ రూం ఇళ్ల డ్రా పేరుతో మోసానికి పాల్పడ్డారని, ఇందుకు జిల్లా కలెక్టర్‌గా ఎస్.వెంకటరావు సహకరించారని బీజేవైఎం రాష్ట్ర నాయకుడు సంకినేని వరుణ్‌రావు ఆరోపించారు. శుక్రవారం పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో పార్టీ నాయకులతో కలిసి ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. కుడకుడ శివారు సర్వే నంబర్ 126లో బీఆర్‌ఎస్ నాయకులు, మంత్రి అనుచరులు జీఓ 58, 59తో అక్రమంగా ప్రభుత్వ భూమి పొందారని ఆధారాలతో సహా నిరూపించానని తెలిపారు. దీన్ని జీర్ణించుకోని బీఆర్‌ఎస్ నాయకులు పట్టణంలో డబుల్‌బెడ్ రూం ఇళ్ల లబ్ధిదారులుగా ఎంపికైన కొందరితో ఇంటి ఎదుట ధర్నాలు చేయిస్తున్నారని విమర్శించారు. ఇళ్ల కోసం 16వేల మంది దరఖాస్తు చేసుకుంటే నిర్మాణం పూర్తయిన 385 ఇళ్లకు 804 మందిని డ్రాలో ఎలా ఎంపిక చేశారని ప్రశ్నించారు. 8నెలల గడుస్తున్నా ఎందుకు వారికి అలాట్‌మెంట్ చేయలేదని, ఈ విషయాన్ని లబ్ధిదారులు గమనించాలని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ పథకమైన ప్రధానమంత్రి ఆవాస్ యోజనలో భాగంగానే సూర్యాపేటలో ఇళ్లను నిర్మించారని, పేదలకు న్యాయం జరగాలంటే బీజేపీతోనే సాధ్యమని తెలిపారు. ఈ సమావేశంలో మైనార్టీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి ఎండీ.అబీద్, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు చల్లమల్ల నరసింహ, పట్టణ ప్రధాన కార్యదర్శులు ఆరూరి శివ, తొనకునూరి సంతోష్‌కుమార్, నాయకులు శైలేందర్, మంగ్యానాయక్, బత్తుల బాబు, సికిందర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య



గుమ్మడవెల్లిలో ప్రభుత్వ పాఠశాలను పరిశీలిస్తున్న ఎంపీడీఓ సత్యనారాయణ

మద్దిరాల : విద్యార్థులకు ప్రభుత్వ పాఠశాల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని ఎంపీడీఓ మార్గం సత్యనారాయణరెడ్డి అన్నారు. శుక్రవారం గుమ్మడవెల్లి గ్రామంలోని ప్రాథమిక పాఠశాలను ఆయన సందర్శించారు. పాఠశాలలోని తరగతి గదులను పరిశీలించి విద్యార్థులతో ముచ్చటించారు. అనంతరం రికార్డులను పరిశీలించి మాట్లాడారు. విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని మధ్యాహ్న భోజన సిబ్బందిని ఆదేశించారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించి చిన్నారుల బరువులను తెలుసుకున్నారు. వారికి తగిన పౌష్టికాహారం అందించాలని సిబ్బందికి సూచించారు. గ్రామంలో డ్రెయినేజీలను శుభ్రం చేసే పనులను పరిశీలించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి విజయేందర్, ఫీల్డ్ అసిస్టెంట్ శోభి, అంగన్‌వాడీ సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ సాగుపై రైతులకు అవగాహన



మాట్లాడుతున్న ఉద్యానవన శాఖ అధికారి జగన్

పెన్‌పహాడ్ : ఆయిల్‌పామ్ సాగుతో అధిక దిగుబడులు సాధించవచ్చని డివిజన్ ఉద్యాన వన శాఖ అధికారి జగన్, మండల వ్యవసాయ అధికారి బి.కృష్ణసందీప్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని రైతువేదిక కార్యాలయంలో పామాయిల్ సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. మార్కెట్‌లో డిమాండ్ ఉన్న ఆయిల్‌పామ్ తోటలను సాగు చేస్తే రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందుతారని తెలిపారు. ఆయిల్‌పామ్ సాగు చేసే రైతులకు ప్రభుత్వం రాయితీలు ఇస్తుందన్నారు. బిందు సేద్యంపై ఎస్సీ, ఎస్టీ రైతులకు 100శాతం, బీసీ సన్న, చిన్నకారు రైతులకు 90శాతం, ఇతర కేటగిరి రైతులకు 80శాతం రాయితీ ఇస్తుందని తెలిపారు. ఎరువులు, అంతర పంటల యాజమాన్యానికి ఒక ఎకరానికి రూ.4200ల చొప్పున మొదటి నాలుగు సంవత్సరాలు ప్రోత్సాహకం లభిస్తుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పతంజలి ఆయిల్ పామ్ కంపెనీ సూర్యాపేట మేనేజర్ శశికుమార్, ఏఈఓలు సంధ్య, మనోజ్, గోపి, లక్ష్మీనారాయణ, సుధాకర్‌రెడ్డి, రైతులు తూముల ఇంద్రసేనారెడ్డి, తూముల నవీన్, మోహన్ రెడ్డి, రంగారెడ్డి, రవీందర్‌రెడ్డి, మాధవరావు, బత్తిని అంజయ్య, ధర్మారావు తదితరులు పాల్గొన్నారు.

పదవీకాలం ముగిసిన ప్రజాప్రతినిధులకు సన్మానం



చివ్వెంల : మాజీ ఎంపీపీ, ఎంపీటీసీ సభ్యులను సన్మానిస్తున్న అధికారులు, నాయకులు



అర్వపల్లిలో మాజీ ఎంపీపీ రేణుకలక్ష్మీనర్సయ్య యాదవ్ దంపతులను సన్మానిస్తున్న ఉద్యోగులు



అర్వపల్లి : మాజీ జెడ్పీటీసీ వీరప్రసాద్‌ను గజమాలతో సన్మానిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు



నాగారంలో పదవి కాలం పూర్తయిన ప్రజాప్రతినిధులను సన్మానిస్తున్న అధికారులు

చివ్వెంల : ప్రజా సేవతోనే ప్రజా ప్రతినిధులకు తగిన గుర్తింపు లభిస్తుందని మాజీ ఎంపీపీ ధరావతు కుమారి బాబు నాయక్ అన్నారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన మాజీ ఎంపీపీ, మాజీ ఎంపీటీసీల వీడ్కోలు సన్మాన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి కె.జగదీశ్వర్ రెడ్డి, తహసీల్దార్ క్రిష్ణయ్య, ఎంపీడీఓ సంతోష్ కుమార్, ఏఓ ఆశాకుమారి, ఏపీఎం రాంబాబు, ఏపీఓ నాగయ్య, మాజీ ఎంపీటీసీలు వేములపల్లి వాసుదేవరావు, గుగులోతు మంత్రి, నాతాల ఉమ, ధరావతు సుశీల సాగర్, రేణుక పాల్గొన్నారు.

అభివృద్ధిలో ప్రజాప్రతినిధులది కీలక పాత్ర

నాగారం : అభివృద్ధిలో ప్రజాప్రతినిధులది కీలక పాత్ర అని మాజీ ఎంపీపీ కూరం మణివెంకన్న, మాజీ వైస్‌ఎంపీపీ గుంటకండ్ల మణిమాల అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో జరిగిన పాలక వర్గ వీడ్కోలు సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. ప్రజాసేవ చేసిన వారికి ఎల్లప్పుడూ గుర్తింపు లభిస్తుందని, ఐదేళ్ల కాలంలో మండలాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేశామన్నారు. అనంతరం పదవి కాలం పూర్తయిన ఎంపీపీ, వైస్‌ఎంపీపీ, ఎంపీటీసీలను అధికారులు, నాయకులు శాలువాలతో సన్మానించి, మెమొంటోలు అందించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ బ్రహ్మయ్య, ఎంపీడీఓ ధార శ్రీనివాస్, ఎంపీటీసీలు చింతారెడ్డి రాజగోపాల్‌రెడ్డి, బండగొర్ల నరేష్, ఏగూరి మంజుల, ఈరేటి స్వప్నఅంజయ్య, వడ్డే పరశురాములు, జంపాల శోభరాజు, ఎస్‌డి.బడేమియా, ఆయా పార్టీల నాయకులు కల్లెట్లపల్లి ఉప్పలయ్య, గుండగాని అంబయ్య, యారాల రాంరెడ్డి, పసుపులేటి వెంకట్‌రెడ్డి, యారాల నర్సింహారెడ్డి, ఈదుల కిరణ్, ఈరేటి అంజయ్య, కుంభం కర్ణాకర్, గట్టు నర్సింహారావు, ఆయా గ్రామాల కార్యదర్శులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

మాజీ ఎంపీటీసీకి సన్మానం

మండల పరిధిలోని పస్తాల గ్రామ ఎంపీటీసీ బండగొర్ల నరేష్ పదవి కాలం పూర్తి కావడంతో శుక్రవారం గ్రామానికి చెందిన యూత్ కాంగ్రెస్ నాయకులు శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా యూత్ కాంగ్రెస్‌నాయకులు మాట్లాడుతూ భవిష్యత్తులో ఉన్నత పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడు పోగుల విక్రమ్‌గౌడ్, కార్యదర్శి చింతకుంట్ల మహేష్, యూత్ కాంగ్రెస్ నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

మాజీ ఎంపీపీ దంపతులకు సన్మానం

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం ఎంపీపీగా పదవీ కాలం పూర్తయిన మన్నె రేణుక–లక్ష్మీనర్సయ్యయాదవ్ దంపతులను శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ఉద్యోగులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీపీ మాట్లాడారు. మండల పరిషత్ నిధుల ద్వారా అన్ని గ్రామాల అభివృద్ధికి కృషి చేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ సందీప్‌కుమార్, పీఆర్ ఏఈ అశోక్, ఏపీఎం మల్లేష్, ఏపీఓ ఉపేందర్, కార్యాలయ సిబ్బంది చక్రహరి నర్సింహరాజు, ఎం.నవీన్, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధిహామీ, సెర్ప్ సిబ్బంది పాల్గొన్నారు.

మండల అభివృద్ధికి కృషిచేశా

జెడ్పీటీసీగా, ఎంపీపీగా జాజిరెడ్డిగూడెం మండల అభివృద్ధికి ఎంతో కృషిచేసినట్లు మాజీ జెడ్పీటీసీ దావుల వీరప్రసాద్‌యాదవ్ చెప్పారు. అర్వపల్లిలో బీఆర్‌ఎస్ గ్రామ కమిటీ ఆధ్వర్యంలో పలువురు నాయకులు శుక్రవారం మాజీ జెడ్పీటీసీ వీరప్రసాద్–మాజీ ఎంపీపీ దావుల మనీషా దంపతులను గజమాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కేవీ, మొరిశెట్టి ఉపేందర్, కడారి నరేష్, దావుల లింగయ్య, పెద్దులు, పులిచెర్ల ప్రభు, బత్తుల వెంకటేశ్వర్లు, కట్టెల మల్లేష్, భూమయ్య, వెంకన్న, గోసుల విజయ్, పి.సైదులు, నాగరాజు, రవీందర్ నాయక్, వెంకన్న, శ్రీకాంత్, నవీన్, సోనబోయిన వెంకన్న, ఉపేందర్, తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



మోడల్ స్కూల్‌లో భోజనం చేస్తున్న ఆర్డీఓ

ఆత్మకూర్(ఎస్) : పాఠశాలలు, హాస్టళ్ల ఆవరణలో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఆర్డీఓ వేణు మాధవరావు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌ను తనిఖీ చేశారు. పాఠశాలలో ఉన్న కంప చెట్లను, ముళ్లపొదలను తీసివేయించాలని సిబ్బందిని ఆదేశించారు. ఎప్పటికప్పుడు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకున్నప్పుడే విద్యార్థులకు ఎలాంటి ప్రమాదం ఉండదని అన్నారు. అంతకుముందు తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి పలు రికార్డులను పరిశీలించారు. మోడల్ స్కూల్లో విద్యార్థులు మధ్యాహ్న భోజనం చేస్తుండగా ఆర్డీఓ కూడా వారితో కలిసి మధ్యాహ్నం భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ వినోద్ కుమార్, నాయబ్ తహసీల్దార్ హరిశ్చంద్ర ప్రసాద్, ఆర్ఐ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి వార్షికోత్సవాలు

మునగాల : మండల కేంద్రంలో శనివారం నుంచి నిర్వహించే శ్రీపెద్దమ్మతల్లి ఆలయం మూడవ వార్షికోత్సవాలను విజయవంతం చేయాలని మునగాల పరగణా ముదిరాజ్ సంఘం సభ్యులు కోరారు. వార్షికోత్సవాల్లో భాగంగా శనివారం ఉదయం 7గంటలకు గణపతి పూజ, పుణ్యాహవచనం, రక్షాబంధనం, అమ్మవారికి అభిషేకాలు ఉంటాయని తెలిపారు. సాయంత్రం 4 గంటలకు అమ్మవారికి బోనాల సమర్పణ, ఆలయం ఆవరణలో అమ్మవారి చరిత్ర ప్రదర్శింపబడుతుందని పేర్కొన్నారు. ఆదివారం ఉదయం అమ్మవారికి, పోతురాజుకు నైవేద్యం సమర్పణ ఉంటుందని తెలిపారు.

విద్యార్థి సంఘాల నాయకుల ముందస్తు అరెస్ట్



సూర్యాపేటలోని పోలీస్ స్టేషన్‌లో అరెస్టయిన విద్యార్థి సంఘాల నాయకులు



చివ్వెంలలో..

సూర్యాపేట : నిరుద్యోగ సంఘాలు ఇచ్చిన టీజీపీఎస్సీ ముట్టడి సందర్భంగా పట్టణంలో విద్యార్థి సంఘాల నాయకులను శుక్రవారం పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్‌వీ సూర్యాపేట మండల అధ్యక్షుడు బొడ్డు కిరణ్‌కుమార్‌యాదవ్, గిరిజన సంఘాల నాయకులు బాణోతు నర్సింహ, బాణోతు హరీష్‌నాయక్‌ను సూర్యాపేటలో ముందస్తుగా అరెస్టు చేసి సూర్యాపేట రూరల్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

చివ్వెంల : హైదరాబాద్‌లో టీజీపీఎస్సీ ముట్టడి నేపథ్యంలో శుక్రవారం తెల్లవారు జామున పలువురు విద్యార్థి సంఘం నాయకులను పోలీసులు ముందస్తుగా అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించారు. అరెస్టయిన వారిలో బాష్పంగు సునీల్, ధరావతు సుమన్, నాగరాజు, అఖిల్, ప్రవీణ్ తదితరులు ఉన్నారు.

తిరుమలగిరి : టీజీపీఎస్సీ ముట్టడి నేపథ్యంలో స్థానిక పోలీసులు శుక్రవారం బీఆర్‌ఎస్‌వీ నాయకులను ముందస్తు అరెస్టు చేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఉద్యోగాలను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగ భృతి ఇవ్వాలని కోరారు. అరెస్టయిన వారిలో నాయకులు కారుపోతుల నరేష్, కందుకూరి బాబు, పోతరాజు కృష్ణ, మల్లేష్, గిరిబాబు, వెంకన్న తదితరులు ఉన్నారు.

ఆత్మకూర్(ఎస్) : నిరుద్యోగ జేఏసీ పిలుపుమేరకు టీజీపీఎస్సీ కార్యాలయం ముట్టడిని దృష్టిలో ఉంచుకొని శుక్రవారం తెల్లవారుజామున వివిధ విద్యార్థి సంఘాల, ప్రజాసంఘాల నాయకులను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు. బీజేపీ మండల అధ్యక్షుడు పందిరి రాంరెడ్డి, పీడీఎస్‌యూ నాయకుడు జలగం సుమంత్, ఏఐఎస్‌ఎఫ్ జిల్లా నాయకుడు గోపగాని రవికుమార్, యువజన సంఘాల నాయకులు రాచమల్ల సంతోష్, పగిడి విజయ్, జంపాల వినోద్‌లను ముందస్తుగా అదుపులోకి తీసుకొని సొంత పూచీకత్తుపై విడిచిపెట్టారు.

నాగారం : నిరుద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ హైదరాబాద్‌లోని తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ కార్యాలయ ముట్టడికి వెళ్తున్న విద్యార్థి సంఘాల నాయకులను, వివిధ పార్టీల నాయకులను మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో పోలీసులు శుక్రవారం ముందస్తుగా అరెస్టు చేశారు.



తిరుమలగిరి పోలీస్ స్టేషన్‌లో..



ఆత్మకూరులో..



నాగారం పోలీస్‌స్టేషన్‌లో..

ఉపాధ్యాయులకు వీడ్కోలు సమావేశం



అర్వపల్లి : ఉపాధ్యాయులను సన్మానిస్తున్న పాఠశాల సిబ్బంది, విద్యార్థులు



నాగారం : బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ఎంఈఓ బి.బాలునాయక్

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం ప్రాథమిక పాఠశాలలో పనిచేసి పదోన్నతిపై వెళ్లిన, బదిలీపై ఇక్కడకు వచ్చిన ఉపాధ్యాయులకు శుక్రవారం స్థానిక పాఠశాలలో సన్మాన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఈఓ బాలునాయక్, పాఠశాల హెచ్ఎం ఇందిర, రిటైర్డు హెచ్ఎం సాటిక సుధాకర్, టీపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు యోగాచార్య డాక్టర్ పగిళ్ల సైదులు, దబ్బేటి యాదగిరి, సుగుణ, మధుసూదన్‌రావు, సీహెచ్.వెంకటేశ్వర్లు, నాగరాజు, మంజుల, ఎల్లంల కొమిరెల్లి, కుంభం రాంమ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులకు సన్మానం

నాగారం : మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాల నుంచి బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులు వర్దెల్లి మల్లయ్య, బి.వెంకటమల్లులను శుక్రవారం పాఠశాలలో స్థానిక ఎంఈఓ బి.బాలునాయక్, ఉపాధ్యాయులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాందాస్‌నాయక్, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు జ్ఞానేశ్వరచారి, ఉపాధ్యాయులు వీరేష్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

రజతోత్సవాలను విజయవంతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న చింత బాబు

కోదాదరూరల్ : హైదరాబాద్‌లో ఈ నెల 7న నిర్వహించబోయే మాదిగ దండోరా రజతోత్సవాలను విజయవంతం చేయాలని టీఎమ్మార్పీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చింతా బాబు మాదిగ పిలుపునిచ్చారు. శుక్రవారం కోదాడ పట్టణంలోని ఎమ్మార్పీఎస్ కార్యాలయంలో నిర్వహించిన నియోజకవర్గ ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మాదిగ దండోరా ఉద్యమం ఎమ్మార్పీఎస్‌గా ఏర్పడి ఏబీసీడీ వర్గీకరణే లక్ష్యంగా ముప్పై సంవత్సరాలుగా అనేక పోరాటాలు చేస్తుందని తెలిపారు. ఈ రజతోత్సవాలకు సీఎం రేవంత్‌రెడ్డితో పాటు మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, మాదిగ మేధావులు హాజరవుతున్నారని తెలిపారు. మాదిగ, మాదిగ ఉపకులాల కవులు, కళాకారులు, స్టూడెంట్ ఫెడరేషన్ నాయకులు హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బాణాల అబ్రహం, ఏర్పుల చిన్ని మాదిగ, బొల్లెపోగు స్వామి, కందుకూరి నాగేశ్వరరావు, కొత్తపల్లి శ్రీను, పిడమర్తి బాబురావు, నూకపోగు రాంబాబు, సోమ నరసయ్య, గుర్వయ్య తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతో దోమల నివారణ

మునగాల : పరిసరాల పరిశుభ్రతతో దోమల వ్యాప్తిని నివారించవచ్చని రేపాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం హెల్త్ అసిస్టెంట్ లింగం రామకృష్ణ అన్నారు. శుక్రవారం రేపాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని నర్సింహులగూడెంలో పరిశుభ్రతపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా గ్రామంలో పర్యటించి నిల్వ నీటిని తొలగించారు. అనంతరం రామకృష్ణ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు పాటించాలని కోరారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అన్ని రకాల రక్త పరీక్షలు నిర్వహిస్తామని, పాముకాటు, తేలుకాటు, కుక్కకాటుకు మందులు అందుబాటులో ఉన్నాయని వివరించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ ఏఎన్‌ఎంలు పద్మ, పావని, ఆశా కార్యకర్తలు జ్యోతి, రమణ, సుధారాణి, లక్ష్మి, నాగమ్మ, విజయలక్ష్మి పాల్గొన్నారు.